"కొలంది మిాటినపుట్టకురువ లంకాపురి - గొనకొన్న జలరాశి గుండ్లకమ్మ"

"అహా నీ మాయ యేమని యభినుతింతు
బొసంగ నీ పాదమునం బుట్టి పుడమి ముంచె
మేలుగా నౌల మంచెం బాతాళగంగ
నెమలి గుండము శ్రీరంగ నిర్మలాంగః"

"రమ్యగుణసాంద్ర కంబము రామచంద్ర"

"వానకురిపించి రక్షించు మానవులను - రమ్యధవళాంగ కాకర్ల రామలింగ"

"నందవరమందు నెలకొన్న నయకదంబ - సరససద్గుణ నికురుంబ చముడవమాంబ"

"కృష్ణవేణ్ణినది కేవలపశ్చిమం - బలేశ్వరం బన నెసంగుపురము"

"శ్రీగిరిప్రాగ్దిశ శ్రీ కాలవాలమై - విలసిల్లు విరిదండ విన్నకొండ"

"గడ్డి గడ్డని మంచి దొడ్డగా పలికేవ్వా
గడ్డి బేరము జెప్పు వో పిల్లా
నీ మూట బేరము జెప్పు సోకిల్లా
దండిదీ నామూట కుర్రోడా
నువు దైర్నముంటే దించుపిల్లోడా
అయ్యె వంటెద్దు నాగడ్డి మెయ్యాలే
నీకు వొక్కటే రంకేమొ యెయ్యాలే"



"చెన్నెరగ పూర్వము నిట - కన్నెలు వసియించు చుండ్రి దేవకన్యల వోలెన్
అన్నెరులు కలుగుటచే - అన్నె వచియింత్రు కన్నె లూరను పేరన్"

"వెలిగొండలకంటె పొడుగు - కనిగిరి కంటె వెడల్పు - ఉదయగిరికంటె ఎత్తైన కొండలులేవు"

"వెలిగొండ వంటి తండ్రి కంటే - ఏకులబుట్ట వంటి తల్లి మేలు"

"సంగాం కొమ్మ సక్కగా ఎత్తినట్లు"

గుట్టలచేను కురవ - గుండెల్లో గస
బండకింద బొచ్చుపురుగు - ఎలుగు
రొగునిండా తప్పెట్లు - కప్పలు
చిన్నపిల్లవానికి పుట్టెడు అంచులు - ఏదుముళ్ళు



" పులికి మల అండ - మలకు పులి అండ "

'శక్తి' 305, జనప్రియ అబోడ్స్, గాంధీనగర్, హైదరాబాదు. *Ph: 040- 66624787, www.sakti.in*





# నల్లమల అడవులలో ప్రకృతి - సంస్కృతి



***Forests are reservoirs of water, lungs of environment***

## ప్రకృతి గురువు - గిరిజనులు, గ్రామీణులు మార్గదర్శకులు

***Nature is our teacher - Local people are our guides***

## అడవులు, లోయలు, బయళ్ళు, పీఠభూములలో జీవనవిధానాలు

## అడవులు మంచినీటి గనులు - భూగోళం శ్వాసకోశాలు

నల్లమలఅడవులు పులులకు, గోదావరిలోయలు అడవి దున్నలకు (గౌరగేదె), విశాఖబయళ్ళు పంటలకు ప్రసిద్ధి. నల్లమలలోని సరులలో తేనెపెరలు, సెలలలో వాగులు, గడ్డిబరకలలో దుప్పులు, కణుసులు, రేచుకుక్కలు, పులులు విస్తారం. ఇక్కడ నివసించే చెంచులు ఈ అడవులలో ఆహారం, అటవీ ఫలసాయం సేకరించుకుంటూ కొద్దిగా వ్యవసాయం చేస్తున్నారు. వేనం, లొద్ది, గొంది, జౌక లతో నిండిన గోదావరి లోయలోని దట్టమైన అడవులలో గిరిజనులు పోడువ్యవసాయం చేస్తూండగా, విశాఖబయళ్ళలోని మెట్టు పొలాలలో ఆహార ధాన్యాలతో పాటు పసుపు, పిప్పలి, అల్లం, అనాస వంటి వాణిజ్యపంటలను కూడా పండిస్తున్నారు. పశుపాలన, వ్యవసాయం, అడవుల సమతుల్యత డక్కన్‌పీఠభూమి ప్రత్యేకత. మెట్టప్రాంతాల్లో గట్టికలప, వర్షపాతం అధికంగాగల ప్రాంతంలో మెత్తని కలపగల అడవులున్నాయి.

"గోదావరినదికి మేనెలలో కృష్ణకు జూన్‌లో పెన్నకు జులైలో ఏరువాక" అనే సామెత ఆయా నదిపరివాహక ప్రాంతాలలో వాన రాకడ, వర్షపాతం అందుకు తగినపంటల అదును తెలియజేస్తుంది. ఇలా ఆయా ప్రాంతాలలో అడవులు, ఆదివాసుల, గ్రామీణుల ప్రత్యేకతలను తెలుసుకోవడానికి ఈ వైవిధ్యాన్ని మలచుకున్న సంస్కృతిని మరింతగా అర్థం చేసుకోవాలి.



**కురవ, కట్టువ, సారవ; నరవ, జౌక, గుండం, దూకుడు, ఎత్తిపోతల, బుగ్గ, పడియ, గోబెలతో నల్లమలఅడవులు:**

ఆంధ్రప్రదేశ్ మధ్యన ఆరు జిల్లాల్లో మెట్ట ప్రాంతాలకు (గుంటూరు, ప్రకాశం, మహబూబ్‌నగర్, కర్నూలు, కడప, నల్గొండ) తృణకాష్ట జలసమృద్ధి(గడ్డి, కలప, నీరు) సమకూర్చే నల్లమలల మీద ఆధిపత్యానికి ఆనాటి పాలకులు తీవ్రంగా పోటీపడ్డారు. ఓడిపోయిన రాజులు ఈ అడవులలో తలదాచుకుని బలం పుంజుకున్నాక తిరిగి దాడులు చేసేవారు. తమ శత్రువుల జాడ తెలుసుకోవడానికి ఆంధ్రదేశాన్ని పాలించిన రాజులందరూ సాంస్కృతిక విధానాలను ప్రోత్సహించారు. 'చెంచుమలచూర కార' అని బిరుదులు ధరించారు.

## సంప్రదాయం - తిరుగుబాటు

శాతవాహనులు క్రీ.శ మొదటి శతాబ్దాలలో పలనాడులోగల నాగార్జున కొండచుట్టూ శ్రీపర్వత సంఘారామాన్ని అభివృద్ధిచేసి బౌద్ధమత ప్రచారాన్ని ప్రోత్సహించారు. ఒక దళితుడు పూర్ణకుంభ శిల్పాన్ని మహాబోధికి అంకితం చేశాడు. బౌద్ధుల ప్రభావం తగ్గాక శైవులు మరో శ్రీపర్వతం/శ్రీశైలం చేరుకోవడానికి 8 నడకదారులేర్పరచి వాటివెంట గుళ్ళు, గోపురాలు, చెరువులు, బావులు తవ్వించి వ్యవసాయం అభివృద్ధి చేశారు. బౌద్ధనాగార్జునునికి దీటుగా సిద్ధనాగార్జునుడు దిండి, కృష్ణానది సంగమంలో ఇక్ష్వాకులసాయంతో ఏలేశ్వరంలో కామేశ్వరీక్షేత్రాన్ని శ్రీశైలానికి నైరుతి ముఖద్వారంగా తీర్చిదిద్దాడు. 'సిద్ధ'వటం దక్షిణముఖద్వారం. ఇలా సిద్ధులను, స్వర్ణయోగులను, మూలికావైద్యులను నల్లమలలు ఆకర్షించసాగాయి. లోతువాగు,ఎర్రవాగులు గుండ్లకమ్మలో కలిసే సురభేశ్వరం ఉపముఖ ద్వారం. అమరాబాదు విష్ణుకుండినుల రాజధాని. దగ్గరలో లక్ష్మీపురంలో నవనరసింహాలయాలు, ఉమామహేశ్వరంలో నవలింగాలు పశ్చిమచాళుక్యుల నాటివి. అలంపురంలో నవబ్రహ్మాలయాలు, నల్లమల అంకాలమ్మ, ఎరుకల నాంచారమ్మ, కోటసత్తెమ్మ, మంతనాలమ్మ, గన్నికలు(జలకన్యలు), బయన్న, కాటమరాజు, పోతురాజు – వీరంతా కొండ, కోన, చెట్టు, పుట్ట, చెరువులు కాపాడే గ్రామదేవతలు. గోసంగివీరులు బీర్నీడు, చెన్నప్ప కాటమరాజుకు బాసటగా నిలబడి వీరమరణం పొందారు. వారి సంతానం కొమ్ములవారు యాదవ వీరగాథలను గానం చేస్తుంటారు.









"నాగార్జునుడికి నమస్కరించి - మాశర్లయో శెన్ను నిదలిసి
కారంపుడి అంకమ్మను కొలిసి - గుత్తికొండ బెలస్తానంలోను
మత్తు నిద్ర బ్రెమ్మయ్యను లేప"

"ఉప్పు గోంగూర ఊరతొక్కుతో - సప్పిడి తైదల సంకటిగాదిక
పప్పుగాక పది కూరలతోని - సాములు బువ్వారామరాజ్జెమై!"



"కట్టమీద రెండు జిట్ట రేగుల్లు
అవిఅల్లు కొన్నాయి అల్ల నేరేళ్లు
అల్లిబిల్లి చెట్టు అల్లినేరేళ్లు
అల్లినేరేడు కింద చల్లని చెలమ
చల్లి చెలమ కాడ చల్దారగించి"



"నల్లకొండల నడుమ వృతికేటి చాకి
మాయన్న యేసిన ధట్టి పేరేమి
చింతకుంట నూలమ్మ శిరువేళ్ల తొగరు
నంద్యాల నల్లంచు లంజె పేటంచు
కందనోలు కరకంచు కంది బేడంచు"



"కోయిలకుంట్ల గుట్టలెంటా
కుందేరూ వొడ్డులెంటా
గుర్రు మెక్కనీవువస్తే కుంపిణీకి గుండె దిగులూ
దొరవారి నరసింవ్వా రెడ్డి
నీ దొరతనము కూలిపోయె రాజా నరసింవ్వారెడ్డి"



అడవిలో ఆంబోతు రంకెవేసింది - గొడ్డలి
అడవిలో అక్కమ్మ ఆకుపోసింది - సాలీడు
అద్దంకి చేలో హంసలేచింది - పుట్టగొడుగు
ఆకాశాన వెన్నముద్దలు వేలాడుతున్నాయి - వెలక్కాయలు
ఆకాశన అరవైఆరు కొడవళ్ళు వేలాడుతున్నాయి - చింతకాయలు
అరచెయ్యంతపట్నం అరవైఆరుగదులు, గదికొక సిపాయి సిపాయికొక తుపాకి - తేనెపట్టు

## నుడి - నానుడులలో నల్లమల

నల్లమల్లడవుల తెల్లవారేపొద్దు
అంబటాలకే సీమపై అగ్గి కురిపించు
సందెపూట నందికొండ నీడల్లో కొండ వాలుల్లో
సల్లగాలికి ఒళ్ళు మరిసి నిదురించు అలసి నిదురించు
॥ నను గన్న నా తల్లి రాయలసీమ రతనాల సీమ
తనువెల్ల తరుగని గనులున్న సీమ గిరులున్న సీమ ॥ ...గోరటి వెంకన్న

**"చెంచుల ఆహోబలపు శ్రీనారసింహుడు"** ...**అన్నమాచార్య**

**"సిద్ధమునివరులు ఇందలి చెంచులెల్ల"** ...**జక్కన**

**"మా కాంక్ష లీడేర్చు - మాచెర్ల చెన్న"** ...**పల్నాటివీరభారతం, శ్రీనాథుడు**

"ఏ కులమని నను వివరమడిగితే - ఏమని చెప్పుదు లోకులకు పలుగాకులకు" ...సిద్ధయ్య

**"చిత్ర స్వాతిలోన చెలరేగి పోయేవు ఎంత శౌర్యమే - గుండ్లకమ్మ"**

ఉబగడ్డిలో ఉడుము బలిసె - కాసిగడ్డిలో కణుజు బలిసె
అడవితీపి పగుళ్ళలో ఉంటుంది - తేనెపట్టు
వట్టి బరకల పాలు పొంగు - పుట్టకొక్కులు
కొమ్మకొమ్మకు సంగటి ముద్దలు - వెలక్కాయలు

కానుగచెట్టు పూసినప్పుడు ఉసిళ్ళకు కాళ్ళువస్తాయి
రేలచెట్టు పూసినప్పుడు రెక్కలు వస్తాయి
ఏగిపూసినప్పుడు బండలపై ఎగురుతాయి - ఉసిళ్ళు

'కొరిందలు పూసేటప్పుడు కాటుతక్కువ (దీపావళి)
ఏపెపూసేటప్పుడు ఉట్టి తట్టలే (శ్రావణం)
ఎర్రబలుసు పగిలినప్పుడు కాటుఎక్కువ (తొలకరి) - తేనెలు ...చెంచుల నానుడులు





వెలుగోడుకోటకు యాచమనాయుడి కోడళ్ళందరూ తమ బిడ్డతో బలి అయినారు. సంతానం లేని ఆఖరి కోడలు ఒక దళితులబిడ్డ యాచన్నతో బలి అయినది. అతని పేరు చేర్చుకున్న వెలుగోటివారు ఆ కుటుంబాలకు మన్ననలు చెల్లిస్తారు. శివుడు పరదైవంగా శ్రీశైలం కేంద్రంగా కులరహిత సమాజాన్ని అల్లమ ప్రభువు, అక్కమహాదేవి, బసవేశ్వరుడు; బ్రహ్మనాయుడు అదే ఆశయంతో దళితులను చేరదీసి 'చాపకూటికుడుపు' పేరుతో చెన్నకేశవ దేవాలయాల కేంద్రంగా వైష్ణవభక్తికి నాంది పలికాడు. వైష్ణవులు మరోఅడుగు ముందుకేసి అహోబిలాన్ని నరసింహస్వామి కొలువుగా మార్చడమే కాదు చెంచులక్ష్మిని ఆ స్వామికి దేవేరినిచేసి అటవీప్రాంతాలన్నిటా నరసింహస్వామి క్షేత్రాలను వ్యాప్తిచేశారు.

సగిలేరు లోయలో సిద్ధయ్య, కక్కయ్యలను శిష్యులుగా చేసుకున్న బ్రహ్మంగారు, వారి మతం తిరుగుబాటు ధోరణులకు స్ఫూర్తినిచ్చారు. ఈ మండలంలో నల్లమలఅంకాలమ్మ జాతరలో పలనాటి గొల్లసుద్దులు పాడుతారు. ఇలా వర్ణాశ్రమ ధర్మాలను పాటించే వైదికులతో, కులాలకతీతమైన భక్తిని ప్రోత్సహిస్తూ నాటి సంస్కృతులు పోటీపడ్డాయి. సమసమాజం కోసం పాటుపడ్డాయి. పర్వతాల మల్లన్నగా పేరొందిన భ్రమరాంబ మల్లికార్జునులు మరెవరో కాదు, కుక్కలను అంటే కాలభైరవుని వెంటేసుకుని అడవికి పోయే చెంచుదంపతులే. సరులనుండి తేనెతీసే చెంచులు మల్లలమ్మకు మల్లలమ్మగడ్డ అని ఒక తునక నైవేద్యం పెడతారు. ఆ మల్లలమ్మే చెంచుమల్లన్న, శిలాజరూపంలో వృద్ధమల్లికార్జునుడు, తరువాత మల్లికార్జునుడైనాడు. సామంతపూడి మల్లయ్య పద్యరూపంలో చెప్పిన క్రైస్తవగ్రంథం శ్రీశైల మల్లికార్జునునికి అంకితం ఇచ్చాడు. దర్గాలు మతసామరస్యానికి, మిషనరీలు విద్యావ్యాప్తికి కృషి చేసి దళితులు ఆభివృద్ధి ఫలాలు అందుకోవడానికి తోడ్పడ్డారు. కానీ వర్ణ వర్గ వ్యవస్థలమీద తిరుగుబాటు చేయలేకపోయారు.

## నీటివనరులు

నాటి పాలకుల మతరాజకీయాలు ఎలా వున్నా, వారు సహజవనరుల అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. గుండ్లకమ్మమీద గజపతులు అభివృద్ధి చేసిన కంబంచెరువు ఆసియా ఖండంలోనే పెద్దమానవనిర్మిత జలాశయం. మోటుపల్లి ఒకనాడు అంతర్జాతీయంగా ప్రసిద్ధిచెందిన ఓడరేవు.

కలసపాడు, రాచెరువు, పెండ్లిపల్లె, పిడుగుపల్లె, అక్కసెట్టిపల్లె, చింతపల్లె చెరువుల మీదుగా సగిలేరు ప్రవహిస్తూ చరిత్రప్రసిద్ధమైన పోరుమామిళ్ళచెరువును నింపుతూ పెన్నలో కలుస్తుంది.



అహోబిలంలో పుట్టిన భవనాశి–సంగమేశ్వరంలో, దిండినది–ఏలేశ్వరంలో, కృష్ణానదిలో కలుస్తున్నాయి. రాళ్ళవాగు, బొమ్మలాపురం తరువాత అంతర్వాహినిగా మారింది. ఇంకా అనేక (మహనంది) బుగ్గలు, వాగులు, దొనలు రాయలసీమకు ప్రత్యేకం. వాగుల పక్కన దొరువు బావులు అంతరగంగగా పేరు పొందాయి. తెలుగురాయనిచెరువు, మంతనాలచెరువు, సిద్ధాపురంచెరువు, పెద్దచెరువు, రుషులచెరువు, భీమరాయని చెరువు మొదలైనవి పరిమాణంలో చిన్నవైనా నాటి ప్రజలను వ్యవసాయంవైపు మళ్ళించి ఆహారభద్రత కల్పించడంలో ప్రముఖపాత్ర వహించాయి. మనుమసిద్ధి(నెల్లూరు) కాటమరాజు(కనిగిరి) పుల్లరితగవు పెరిగి పంచలింగాల కొండవద్ద కత్తులు దూశారు. పెదారవీడు మండలంలో "కాటమరాజు కళ్ళి(జాతర) కాసేపు చూసినా చాలు"నట. ఒంగోలు ఎద్దులకు ప్రపంచ ప్రసిద్ధి. ఆ పోగరుబోతు ఆబోతులను ఆడించేవారు తర్లుపాడు మండలంలో గంగిరెద్దులవాళ్ళే. అడవులు, వ్యవసాయం, పశుపాలన, నీటివనరులు, మూలికావైద్యం; అభివృద్ధి ఇలా నల్లమలలో నలుదిశలా పర్యావరణ పరిమితులకు అనుగుణంగా అభివృద్ధి సాగింది. మార్కాపురంతాలూకాలో చెన్నకేశవస్వామి స్తంభాలచూరు, వెంకటాద్రిపాలెంలో గాలిగోపురం, ఎర్రగొండపాలెం మిల్లంపల్లిలో వేణుగోపాలస్వామి శిల్పాలు, రాచబండ, బొమ్మలాపురం పడుచులు, ఆరవీటిబావి నీళ్ళు, త్రిపురాంతకంలో బలిపీఠం – ఇలా అడుగడుగునా ఎన్నో స్థానిక విశేషాలున్నాయి.

నేడు ప్రధానపట్టణాలు నందికొట్కూరు వేరుశెనగ నూనెమిల్లులు, ఆళ్లగడ్డ శిల్పకళ, ప్రొద్దుటూరులో పప్పుశెనగ, ఆత్మకూరులో రవాణారంగం, నంద్యాల ప్లాస్టిక్‌పరిశ్రమ, గిద్దలూరు ఎర్రచందనం, కంబం టొమాటో, వర్జీనియా పొగాకు, మార్కాపురం పలకలపరిశ్రమ, పప్పు, పత్తి మిల్లులు, దోర్నాల వైట్‌బర్లీ పొగాకులకు మార్కెటుకాగా, అన్ని ప్రాంతాల్లో కొర్ర, వరిగ, సజ్జ, రాగి, పత్తి, మిర్చి వంటి మెట్టపంటలు పండుతున్నాయి.

## చరిత్ర

చెంచులను చంపిన వాసిరెడ్డి వెంకటాద్రినాయునికి ఆహారం తేళ్ళు, పాములుగా కనిపించేదట. ఆ పాపవిముక్తికి ఆయన 108 శివాలయాలు కట్టించాడు. బ్రిటిష్ వారికెదురు తిరిగిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నల్లమలలో దుర్గాలనుండే పోరాటంచేశాడు. సైనిక బలగాల, కలప తరలింపుకు బళ్ళారి–గుంటూరురైల్వేలైను వేశారు. కోటలన్నీ ధ్వంసం చేసారు.



# నల్లమలలో నదులు

రాయలసీమకు ఉత్తరదిగ్భాగమున ఎర్రమలలు, వెలుగొండలు నల్లమలలు అను పర్వతశ్రేణులు గలవు. వీని యందలి ముఖ్యనదులు కృష్ణ, తుంగభద్ర. కృష్ణానది మైసూరురాష్ట్రములో కొంతదూరము ప్రవహించి నందికొట్కూరు, మార్కాపురం తాలూకాలో ఉత్తర పొలిమేరచుట్టి గుంటూరు మండలమును జేరుచున్నది. గుండ్లకమ్మ, దాని ఉపనదులు రాళ్లవాగు, తీగలేరు, కండ్లేరు, దువ్వలేరు. ఈ నదులన్నియు నల్లమలలో నావిర్భవించినవి.

గుండ్లకమ్మనది గుండ్లబ్రహ్మేశ్వరమువద్ద ఆవిర్భవించి, జంపలేరు, ఎనుమలేరు అను ఉపనదులను జేర్చుకొని, కంబముగ్రామమును జుట్టుకొనివచ్చి, ఉత్తరాభిముఖమై పూర్వదిశకు ప్రవహించునప్పుడు వెలిగొండ లడ్డుపడుటచే, పొదిలితాలూకా పశ్చిమ యెల్లయైదర్శి డివిజన్‌కు నైఋతిదిక్కుగా నేర్పడి, మార్కాపురము తాలూకాలో నలుబదిమైళ్ళు ప్రవహించి, గుంటూరుజిల్లాలోని వినుకొండకు పదిమైళ్ళ దూరమునున్న ముమ్మడివరము సమీపమున తూర్పుదిక్కుగా తిరిగి, మరల దక్షిణదిక్కై ఒంగోలుతాలూకా గుండా ప్రవహించి పెద్దదేవరంపాడువద్ద సముద్రమును గలియుచున్నది.

సాగిలేరు, భవనాశి యను చిన్ననదులు నల్లమలలోనే జన్మించి, సాగిలేరు పెన్నానదిలోను, భవనాశి–సిద్ధాపురం, ఆత్మకూరు, పెంటకోట, జూటూరు గ్రామములగుండా ప్రవహించి సంగమేశ్వరము వద్ద కృష్ణానదిలోను గలియుచున్నవి. ఈ చిన్ననదులు జీవనదులు కావు. వర్షాకాలమున మాత్రము కొద్దికాలము నీరు ప్రవహించును.

మహబూబ్‌నగర్‌జిల్లాలో దిండినది, కల్వకుర్తి అచ్చంపేట తాలూకాలలో ప్రవహించి కృష్ణానది ఉత్తరమున గలియుచున్నది.

గుంటూరుజిల్లాలో కృష్ణానది ఉత్తర, తూర్పుదిక్కులచుట్టి దాదాపు ఎనభైమైళ్లు ప్రవహించుచున్నది. నాగులేరు, చంద్రవంక చిన్ననదులు.

కడపజిల్లాలో వెలిగొండలు, పాలకొండలు ముఖ్యమైన పర్వతశ్రేణులు. కడప, నెల్లూరుజిల్లాలను వెలిగొండలు వేరుచేయుచున్నవి. పాలకొండలు పశ్చిమ, ఉత్తర భాగమున వ్యాపించి రెండు చీలికలై శేషాచలముకొండలు, నల్లమలకొండలను పేర్లచే పిలువబడుచున్నవి.

**నల్లమలలో కనుమలు:** మంతనాలమ్మకనుమ, వెలుగోటికనుమ, నందికనుమ, జ్యోతికనుమ, దాపల్లెకనుమ, కాకులకనుమ.

– *ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళం, 1979*




- జంతు, జీవ, వైవిధ్య రక్షణకోసం గూడెంవారిగా కమిటీ ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడివనరులు ఉపయోగించుకోవడానికి కొన్ని నిబంధనలు (సీజన్ వగైరా) విధించవచ్చు. వేట పూర్తిగా నిషేధం.
- సాగులో లేనందున పట్టాలకు కొన్నిచోట్ల అటవీశాఖ అడ్డు చెప్తుంది. ఈ విషయమై రాష్ట్రకమిటీకి ఉత్తర్వులు ఇవ్వాలి.



ఎదురుతిరిగిన మండ్లబైగాడిని తుమ్మలబయలులో కాల్చిచంపారు. పల్నాడు తాలుకాలో చెంచుపాలెగాడు రామనాయకుని ఉరితీశారు. కన్నెగంటి హనుమంతు బలిదానం, పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో ప్రముఖ సంఘటన. బ్రిటిష్ హయాంలో శాంతి భద్రతలు ఏర్పడి రవాణా సౌకర్యాలు మెరుగైనాయి. కానీ పర్యావరణ పరిమితులను లెక్కచేయని అభివృద్ధి ప్రారంభమైంది.

## గతించిన స్ఫూర్తి

ఇదంతా గతం. నాటి సాంస్కృతిక స్ఫూర్తి నేడు లోపించింది. చెంచులకు మునుపటి ఆదరణ, ఉపాధిలేదు. దేవాలయాల్లో బలహీనవర్గాలకుగల మర్యాదలు కనుమరుగవుతున్నాయి. వారి గురువులు జంగాలు, సాతానులు, దాసరులు, గొల్లసుద్దులు తగిన గౌరవం లేనందువల్ల వేరే వృత్తులు చూసుకుంటున్నారు. మార్కాపురంలో తమ అభిమాన దైవం చెన్నకేశవునికి దళితులు దూరమైనారు. జాతరలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయిగాని ఆ ఉత్సాహం తాత్కాలికం కావడంవల్ల సమాజాన్ని ఈనాటి విలువలకు అనుగుణంగా మలుపు తిప్పలేకపోతున్నాయి. బ్రహ్మనాయుడు, బ్రహ్మంగారు, బసవేశ్వరుడు మళ్ళీవచ్చి విప్లవశంఖం పూరించాలని బడుగుప్రజలు కోరుకుంటున్నారు.

'గుత్తికొండ బిలస్థానంలో – మత్తునిద్ర బ్రహ్మయ్యను లేప' –కోలాటం పాట

## కరువు కోరల్లో నల్లమల

పశువుల బదులు యంత్రాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పెరిగింది. పోటీపడి డాములు కట్టుకుంటున్నాం అవి నింపే నీటివనరులు మాత్రం అంతరించిపోతున్నాయి. ఎంతో లోతుకు పోయినా భూగర్భజలాల జాడ చిక్కడంలేదు. శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టు రోడ్డు రావడంతో నడకదారుల్లో యాత్రికులు తగ్గారు, కాని వలసలు పెరిగాయి. ఒకనాడు10,416.76 చ.కి.మీ.లలో విస్తరించిన నల్లమలలో అడవులు సంవత్సరానికి సగటున 0.930 చ.కి.మీల చొప్పున నశిస్తున్నాయి. చుట్టూ ఉన్న మెట్టప్రాంతాలో కరువు పెరుగుతుంది. 1867లో పులులను చంపడానికి బహుమతులు ఇస్తే, నేడు పులులరక్షణకు, వాటి జాడకనిపెట్టడానికి ఖర్చుపెడుతున్నాం. ఒకనాడు నడకదారిలో యాత్రికులకు సాయం చేస్తూ చెంచులు మిరాసి వసూలు చేసుకునేవారు. అడవిజంతువులనుండి పంటలకు కాపలా కాసినందుకు వారికి రైతులు మిరాసి ఇచ్చేవారు. ఇప్పుడు ఆ సంబంధాలు అంతరించాయి. ప్రముఖ నరసింహక్షేత్రం ఉరవకొండలో చెంచులక్ష్మికల్యాణం జోగిని సంప్రదాయంలో భాగమైంది.



ఒకపక్కన అభయారణ్యంలోకి వలసలను అరికట్టలేని ప్రభుత్వం, చెంచులను కాలనీలు, పునరావాసంపేరిట రోడ్డుమీదకు తెచ్చి పడేస్తుంది. వారు రోడ్డుమీద బతకలేక, అడవితప్ప వేరే దిక్కులేక నశించిపోతున్నారు. సహజవనరులు జీవవైవిధ్య పరిరక్షణకోసం 3568.09చ.కి.మీలు అభయారణ్యంగా, పులులు, బట్టమేకల రిజర్వుగా ప్రకటించారు. చెంచులకోసం గిరిజనాభివృద్ధిసంస్థ ఏర్పాటు చేశారు.

కాని నేడు పర్యావరణం పరిమితులను పట్టించుకోవడంలేదు. నల్లమల పరిరక్షణకు ప్రభుత్వ కార్యక్రమాలు సరిగా అమలు చేసుకోవడంతో పాటు, చైతన్యవంతమైన ప్రజాఉద్యమం ఈనాటి అవసరం. ప్రపంచవ్యాప్తంగా జీవవైవిధ్యరక్షణకు జరుగుతున్న ప్రయత్నాలను తెలుసుకుని సుస్థిరమైన బతుకు తెరువులదారి పట్టాలి.

### తమతమ ప్రాంతాలలో వనరులు కాపాడుతూ స్థానికప్రజలు అభివృద్ధి పొందుతున్న కొన్ని ఉదాహరణలు:

1. ఆఫ్రికాఖండంలోని జింబాబ్వేదేశంలో కాంప్‌ఫైర్ (నెగడుబస) అనే ఏనుగుల అభయారణ్యం అక్కడ తెగల రక్షణలో అభివృద్ధి చెందుతున్నది. ఏనుగుల పెంపకం, అమ్మకం, దంతాలవ్యాపారం, పర్యాటకరంగాన్ని అక్కడి ఆదివాసులే నిర్వహిస్తున్నారు.

2. నేపాల్‌లోని ఎవరెస్ట్ పర్వతం, ఇతర శిఖరాల చుట్టూ పర్యాటక పరిశ్రమను అక్కడి షెర్పాతెగ వారే చూసుకుంటున్నారు.

3. ఫసిఫిక్ సముద్రంలోగల కోస్టారికా ద్వీపంలో జీవ వైవిధ్యం గ్రంధస్థం చేయడానికి, మెర్క్ అనే మందుల కంపెనీ నిధులు సమకూర్చింది. పాఠశాలచదువుగల యువకులకు శిక్షణనిచ్చి ఆ దేశప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించింది.

4. ఎంతోమంది గిరిజన యువకులు విలువిద్య పోటీలలో కళాప్రదర్శనలలో రాణిస్తున్నారు.



5. కేరళలో కానితెగ వారికి తెలిసిన 'ఆరోగ్యపాచా' మొక్కలతో శాస్త్రజ్ఞులు 'జీవని' అనే బలవర్ధక ఔషధం తయారుచేసి, ఆ ఔషధం అమ్మకంలో ఆ తెగకు వాటా ఇస్తున్నారు.



6. చెన్నైలో పాములు పట్టుకునే ఇరుల తెగవారు ఒక సహకార సంఘంగా ఏర్పడి పాములవిషం పిండి అమ్ముతున్నారు.





7. గుజరాత్‌లో స్వాధ్యాయ సంప్రదాయం ఖాళీ అవుతున్న భూగర్భజలాలను నింపడం ఉద్యమంగా చేపట్టింది.

8. చూరుద్వారా వచ్చే వాననీటిని మంచినీరుగా నిల్వ చేసుకునే పద్ధతులు మళ్లీ ప్రచారంలోకి వస్తున్నాయి.

9. క్షీణిస్తున్న భూముల్లో వాటర్ షెడ్ (అరగాణి) అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఇంధనాలు, సేంద్రియ వ్యవసాయం, చెట్లు నాటడం, మెట్ట పంటలవైపు మళ్ళడం ముందుముందు తప్పని సరి.

10. వీటికి తగ్గట్లు భూగర్భజలాల పరిధి, వాటర్‌షెడ్ (అరగాణి)లో నీటిలభ్యత, వాతావరణం పరిశీలన కేంద్రాల ఏర్పాటు పాఠశాలలో బోధించాలి.

## వనరులపై హక్కులు పొందే అవకాశాలు

గిరిజనులు తరతరాలుగా వాడుకుంటున్న వనరులపై వారి హక్కును గుర్తిస్తూ అటవీహక్కుల చట్టం 2006లో వచ్చింది. ఈ వనరులను గుర్తించే గ్రామపటాలను చెంచు సమగ్రగిరిజనాభివృద్ధి సంస్థ తయారు చేయించింది.

అడవులలో, ప్రభుత్వ భూములలో వన్యప్రాణి నివాసాలను "కన్సర్వేషన్ రిజర్వులు", సమాజం ఉపయోగం కోసం "కమ్యూనిటీ రిజర్వ్"లను వన్యప్రాణి రక్షణచట్టం గుర్తిస్తుంది. జీవవైవిధ్యచట్టం 2002 ప్రత్యేకతగల స్థలాలను "బయోడైవర్సిటీ రిజర్వు"గా గుర్తిస్తుంది. గ్రామసభ, గ్రామ పంచాయితీలు ఈ ప్రదేశాలను గుర్తించి అటవీశాఖకు, రాష్ట్రజీవవైవిధ్య బోర్డుకు ప్రతిపాదనలు పంపవచ్చు. ఈ ప్రదేశాలను రక్షించుకోడానికి, వాటిమీద మేధోసంపత్తి హక్కులు పొందడానికి పర్యాటక కేంద్రాలను నిర్వహించుకుని ఆదాయం పొందే హక్కు గ్రామసభలదే.

## జీవవైవిధ్య వారసత్వం

పాటలు, కథలు, పొడుపుకథలు, స్థలాలపేర్లు, పండుగలు, ఆచారాలు, మందుమాకులు ఇలా వీటన్నింటిలోగల క్రమాన్ని, విజ్ఞానాన్ని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనుభవాలను గమనిస్తూ మన తరతరాల విజ్ఞానాన్ని, మనప్రాంతంమీద హక్కులకు, మన వనరుల అభివృద్ధికి, ఉపాధికి ఆధారం చేసుకోవాలి. ఎదిగేతరంలో ఈ ఆలోచన పెంచేదే "**నల్లమలలో ప్రకృతి-సంస్కృతి**" ప్రచార కార్యక్రమం.